

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మనసుని గిల్లకు

**ఎప్పుడూ ప్లజంట్‌గా** ఉండే హేమ ఆరోజు చిరాగ్గా, విసుగ్గా ఉండడం గమనించిన రోహిత్ ఆ రాత్రి అనునయంగా అడిగాడు.

"ఏమైంది? ఆఫీస్‌లో ఏదైనా ఇబ్బందా?"

"కాదు. మా అత్త వచ్చి పదిరోజులు ఉంటానని మధ్యాహ్నం ఫోన్ చేసింది" హేమ అసహనంగా చెప్పింది.

"ఈ రోజుల్లో చుట్టాలింటికి వచ్చి పదిరోజులుండేవాళ్ళు ఉన్నారా?" రోహిత్ ఆశ్చర్యపోయాడు.

"అదే కదా!"

"ఇంతకీ అత్త అంటే ఎవరు?"

"మా చిన్నత్త. మన పెళ్ళిలో చూసుంటావు. తర్వాత మళ్ళీ ఆవిడని కలవలేదు."

"మీ నాన్నగారి చెల్లెలా? నాకు మీ పెద్దత్త ఒక్కరే తెలుసు. ఈవిడ గురించి చెప్పనేలేదు?" రోహిత్ మరోసారి ఆశ్చర్యపోయాడు.

"మా నాన్న చిన్న చెల్లెలు. అమ్మ పెళ్ళినాటికి చిన్నపిల్ల. స్కూల్‌కి వెళ్తుంటే, ఆవిడకి మా అమ్మ జడలు వేసి, డబ్బాలు సర్ది ఇచ్చేదిట. చాలా చాకిరీ అట. ఆ కోపం మా అమ్మలో ఉండిపోయింది. మా చిన్నప్పుడు మమ్మల్ని బాగా ఎత్తుకు

మోసింది కాని, మా అమ్మ మాటలవల్ల అనుకుంటా. నాకూ చిన్నత్తంటే అభిమానంలేదు" హేమ అయిష్టాన్ని మొహంలో చూపిస్తూ చెప్పింది.

"ఆవిడ ఫేమిలీ?"

"మామ ఆవిడకి నలభై ఏళ్ళు వచ్చేసరికి పోయారు. ఆయన జాబ్ ఇచ్చారు. ఈపాటికి రిటైరై వుంటుందేమో. తెలీదు. పిల్లలు లేరు. అనంతపూర్‌లో ఉంటుంది. రమ్మని చాలాసార్లు చెప్పింది. కాని మేము వెళ్ళలేదు. మా నాయనమ్మ పోవడంతో అత్తలతో సంబంధాలు కూడా పోయాయి. పెద్దత్తది అదే ఊరు కాబట్టి, అమ్మ వయసుదే కాబట్టి వాళ్ళతో పర్లేదు."

రోహిత్ ఏం మాట్లాడలేదు. తన అత్తగారి గురించి అతనికి బాగా తెలుసు. ఈ పెళ్ళి సంబంధం వచ్చినప్పుడే చెప్పారు, తల్లి కొంచెం గడుసుది కాని పిల్ల మంచిది అని.

"ఇంత చిన్న విషయానికి అంత ఆలోచన ఎందుకు? పదిరోజులేగా ఉంటానన్నారు? పాపం ఫేమిలీ కూడా లేదు. విసుగు అనిపించిందేమో!"

"మధ్యాహ్నం ఆఫీస్‌లో ఉన్నప్పుడు అత్త ఫోన్ చేసి 'హేమా నీ దగ్గరకి వచ్చి పదిరోజులు ఉందామనుకుంటున్నాను. రమ్మంటావా?' అని అడిగింది. ఏమంటాం చెప్పు. ఊళ్ళో ఉండటంలేదు లాంటి అబద్ధాలు కూడా చటుక్కున తట్టవు. 'దాందేముంది రా అత్తా' అన్నాను. అలా ఎందుకన్నానా అని బాధపడుతున్నాను" హేమ నిద్రపోతున్న కొడుకుకి దుప్పటి కప్పింది.

"నేను ఇంటర్‌లోకి వచ్చేదాకా ఇలాగే మా ఇంటికి బంధువులు వస్తూపోతూ ఉండేవారు. తర్వాత తగ్గింది. ఇప్పుడు మా అక్క ఫేమిలీ, మనం తప్ప మా విజయవాడ ఇంటికి ఎవరూ రావడంలేదు. మనింటికైనా అంతే. చూద్దాం. ఇదో అనుభవం. మన పిల్లలకి కూడా ఇంట్లో గెస్ట్ ఉండడం ఇదే మొదటిసారి అనుకుంటా. ఎక్కువగా ఆలోచించకు" రోహిత్ సముదాయించాడు.

"మా అమ్మకి చెపితే నన్ను తిట్టిపోస్తుంది. ఇప్పుడు ఆవిడకి చాకిరి చేయాలా? ఆఫీస్‌లో పని చేయాలా?"

"నేను హెల్ప్ చేస్తాలే. ఇదేమీ జటిల సమస్య కాదు" రోహిత్ ఓదార్చాడు.

"అత్త రేపు పొద్దున వస్తోందిట. రైలు ఐదున్నరకల్లా సికింద్రాబాద్ స్టేషన్‌కి వస్తుంది. అంత తెల్లవారు ఝామున మీరు రావద్దులే. ఇంటి అడ్రస్ చెప్పు. నేను వచ్చేస్తా అంది" రెండు వారాల తర్వాత హేమ చెప్పింది.

"పెద్దావిడ. కొత్త ఊరు. నేను వెళ్తానులే. నేను వస్తానని చెప్పు. ఆవిడ ఫోన్ నంబర్ నాకు పంపించు. మా అమ్మకి తెలిస్తే పెద్దవాళ్ళకి ఇచ్చే మర్యాద ఇదేనా అని తిడుతుంది."

"అదే మీ అమ్మకి, మా అమ్మకి తేడా. మధ్యాహ్నం ఫోన్ చేసి అత్త వస్తుందని చెపితే 'ఎందుకు రానిస్తున్నావు, ఊళ్ళో ఉండడంలెదు అని చెప్పక పోయారా' నేను చేసిన చాకిరి చాల్లేదా? నువ్వూ చేయాలా ఆవిడగారికి. అని తిట్టిపోసింది" హేమ నవ్వింది.

ఆ రాత్రి అలారం పెట్టుకుంటూ రోహిత్ అడిగాడు.

"ఇంతకీ మీ చిన్నత్త పేరేంటి?"

"మధుమతి" హేమ చెప్పింది.

ఆరింటికి తలుపు తెరుచుకుని లోపలకి వచ్చిన రోహిత్, వంటగదిలో సతమతమవుతున్న భార్యని పిలిచాడు.

"హేమా.. మేమొచ్చేసాం."

అనాసక్తంగా ఐదు నిమిషాల తర్వాత బయటకి వచ్చిన హేమ సోఫాలో కూర్చున్న చిన్నత్తని అలాగే చూస్తూండిపోయింది. అచ్చం తన తండ్రిలాగే ఉన్న ఆమెని చూడగానే అసంకల్పితంగా ఆప్యాయంగా అడిగింది.

"ప్రయాణం బాగా సాగిందా అత్తా?"

"హేమా! ఎంత మారిపోయావు? అచ్చం ఇల్లాల్లా చక్కగా ఉన్నావు."

మధుమతి లేచి ఆమెని ఆప్యాయంగా దగ్గరకి తీసుకుంది.

"అత్తా. మొహం కడుక్కో. కాఫీ తాగుదువుగాని, నేనీలోగా బ్రేక్‌ఫాస్ట్, నీకు లంచ్ ప్రిపేర్ చేస్తాను. మేమంతా బయటే తింటాం" చెప్పి హేమ తన వెనక దాక్కున్న పిల్లల్నిద్దర్నీ బయటకి లాగి చూపించి చెప్పింది.

"వీడు హేమంత్. ఇది రోహిత. నా కన్నా అల్లరివాళ్ళు."

ఆవిడ ఆసక్తిగా చూస్తున్న ఆ పిల్లలిద్దర్నీ దగ్గరకి అదుముకుని చెప్పింది.

"ముత్యాల్లా ఉన్నారు. మంచి పేర్లు పెట్టారు అర్ధవంతంగా."

పిల్లలు సిగ్గుపడి మళ్ళీ తల్లి వెనక్కు చేరారు.

"హేమా రైల్లోనే మొహం కడుక్కుని కాఫీ తాగేసాను. నాకు గది చూపిస్తే స్నానం చేసివచ్చి నీకు సహాయం చేస్తాను" మధుమతి రోహిత్ గోడపక్కన పెట్టిన తన సూట్‌కేస్‌ని తీసుకుంటూ చెప్పింది.

"అయ్యో ప్రయాణం చేసొచ్చి మీరు చేయడం ఏమిటి పిన్నిగారు నేను హెల్ప్ చేస్తాలే" రోహిత్ మొహమాటంగా చెప్పాడు.

"రా చిన్నత్తా రూం చూపిస్తాను" హేమ సూట్‌కేస్‌ను తీసుకుని ముందుకు దారి తీసింది.

"హేమా ఒక మాట నేను పదిరోజులు ఉండడానికి వచ్చానని చెప్పాగా. చుట్టంగా ఉండడం నాకిష్టంలేదు. ఈ పదిరోజులు నీ చిన్నతనం గుర్తు తెచ్చుకుని, నువ్వు ఎక్కి తొక్కి జడలు లాగిన చిన్నత్తని చుట్టంలా కాక కుటుంబ

సభ్యురాల్లా చూడు. మీరిద్దరూ తయారై ఆఫీస్ లకి వెళ్ళిపోండి. నా లంచ్ నేను వండుకోగలను. కంగారు పడకు. ఇంట్లో చేసుకోవడంలేదా? ఏంటీ? నిన్ను తీసుకుని స్నేహితురాళ్ళ ఇళ్ళకి, సినిమాలకి వెళ్ళిన అత్త గుర్తొచ్చిందా?" మధుమతి అడిగింది.

హేమ నవ్వేసి చెప్పింది. "సరే అత్తా. పిల్లలిద్దర్నీ దింపేసి మేం ఆఫీసులకి వెళ్ళిపోతాం. కలిసి బ్రేక్‌ఫాస్ట్ తిందాం రా."

మధుమతి పావుగంటలో తయారై వచ్చేసరికి రోహిత్ టేబుల్ మీద ప్లేట్లు, మంచినీళ్ళు పెట్టాడు. హేమ ఇడ్లీలని వడ్డించి  చెప్పింది.

"పొద్దున్నే హడావిడి. అందుకని ఇడ్లీ, ఉప్మాలాంటి ఈజీవే చేస్తూంటాను."

"పూరీ చేయమంటే చేయదు" హేమంత్ ఆరోపణగా చెప్పాడు.

"వెధవా. సండే చేయలేదా?" హేమ నవ్వుతూ అడిగింది.

"దాని తర్వాత బోలెడు సండేలు వచ్చాయి."

"కేక్ కూడా చేయదన్నా" చెల్లెలు వెనకేసుకొచ్చింది.

"నీకు బ్రేక్‌ఫాస్‌కి కేక్ కావాలా?" మధుమతి నవ్వింది.

మరో అరగంటలో ఇల్లు ఖాళీ అయింది. హేమ మేనత్తకి జాగ్రత్తలు చెప్పి, కిచెన్‌లో ఏవి ఎక్కడున్నాయో చూపించి వెళ్ళింది.

మధుమతి ఇల్లంతా తిరిగి చూసింది. తన వదిన పనిమంతురాలు. హేమకి కూడా నేర్పించినట్లుంది. పిల్లల గది తప్ప ఇల్లంతా నీట్‌గా ఉంది. మూడు బెడ్‌రూమ్స్ అపార్ట్ మెంట్ అది. హాల్లోంచి బాల్కనీలోకి ఫ్రెంచ్ డోర్ ఉంది. బయట బాల్కనీలో రెండు కుర్చీలు, పిల్లల ఆట సామాన్లు ఉన్నాయి.

వంట చేసుకోడానికి బద్ధకంగా అనిపించి మరోసారి కాఫీ తాగి పడుకుంది.

స్కూల్ నించి కొడుకుని, డే కేర్‌నించి కూతుర్ని తీసుకుని అలసిపోయి వచ్చిన హేమకి తలుపు తీయగానే మసాలా వాసన వేసింది.

"అమ్మా బిర్యానీ" రోహిత గంతులేస్తూ చెప్పింది.

వంట గదిలోంచి వచ్చిన మధుమతి నవ్వుతూ అడిగింది.

"బిర్యానీ కావాలా చిట్టి తల్లీ?"

రోహిత బొమ్మలాగా తలాడించింది.

"ఏం చేస్తున్నావ్ అత్తా ఘుమఘుమలాడిపోతోంది?" హేమ అలసటగా సోఫాలో వాలి అడిగింది.

"చిట్టితల్లి చెప్పిందిగా. బిర్యానీ చేసి పన్నీర్ కర్రీ చేసాను . రోహిత్ తింటాడుగా?" అనుమానంగా అడిగింది.

"హేపీగా తింటాడు. నువ్వు ఈ పదిరోజులు రెస్ట్ తీసుకోవచ్చుగా అత్తా. నీకీ పనులన్నీ ఎందుకు?"

"మీ అమ్మలాగే పనిమంతురాలివి హేమా. కాకపోతే వంట గదిలో చాలా పేకెట్స్ ఎక్స్‌పైరీ డేట్‌కి దగ్గర్లో ఉన్నాయి. నీకు ఆఫీస్‌లో పని, ఇంట్లో పని, పిల్లలతో వాటన్నిటినీ ఎప్పుడు ఖర్చు చేస్తావు? కష్టపడి సంపాదించిన డబ్బు డస్ట్‌బిన్‌లో పడేయడమేగా అని చేసాను. ఈ పదిరోజులు నువ్వు రెస్ట్ తీసుకో. నేను చూసుకుంటాను" మధుమతి ఆప్యాయంగా చెప్పింది.

పిల్లలు బుద్ధిగా తమ గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని వచ్చారు.

"చిట్టి తల్లీ పొద్దున నువ్వేం అడిగావు?" మధుమతి ప్రేమగా అడిగింది.

"పూరీ" హేమంత్ అరిచాడు.

"కేక్" రోహిత అరిచింది.

వాళ్ళిద్దర్నీ టేబుల్ దగ్గరకి తీసుకెళ్ళి చెప్పింది.

"ఇప్పుడు కేక్ తినండి. రేపు బ్రేక్‌ఫాస్ట్‌కి పూరీ. ఓకేనా?"

టేబుల్ మీది కప్ కేక్స్‌ని చూసిన పిల్లలు మొహం విప్పారింది.

"అత్తా. నీకు కేక్ చేయడం కూడా తెలుసా?" హేమ ఆశ్చర్యంగా అడిగింది.

మధుమతి నవ్వింది.

"రోహిత్ భోజనప్రియుడు అత్తా. కానీ నేనే అన్ని రకాలు చేయలేకపోతున్నాను. ఓపిక ఉండడం లేదు. పాపం సర్దుకుపోతున్నాడు. పిల్లల గురించి గిల్టీగా ఉంటుంది. కానీ ఏం చేయను? ఇద్దరం సంపాదిస్తేకాని ఈ మాత్రంగా బతకలేం" హేమ కాఫీ తాగుతూ చెప్పింది.

"నిజానికి ఇవాళ ఫ్రైడే కాబట్టి రోహిత్ నిన్ను బయటకి డిన్నర్‌కి తీసుకెళ్దామని చెప్పాడు. తీరా నువ్వే వండేసావ్."

"ఇంకో రోజు వెళ్దాంలే హేమా.. ఉంటాగా" మధుమతి వంటగదిలోకి వెళ్ళింది.

'అత్త ఇంత మంచిదైతే అమ్మ ఎందుకు ఆవిడ మీద అన్ని చెప్తుంది?' పొద్దున తల్లి ఆఫీస్‌కి ఫోన్ చేసి బీరువాకి తాళం వేసి తాళం చెవులు దాచిపెట్టావా అని అడగడం గుర్తొచ్చింది.

భోజనాలయ్యాక పిల్లలు నిద్రపోయారు. ముగ్గురూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"నీకు హేమ అనే పేరు నేనే పెట్టాను తెలుసా?" మధుమతి చెప్పింది.

"పాత పేరు పెట్టావేం అత్తా. నా స్కూల్‌లో ప్రియాంకలు ఓ ఐదుగురు, మౌనికలు పదిమందిదాకా ఉండేవారు. ఇంకా రమ్య, దివ్యలాంటి పేర్లు ఎంతమందికి ఉండేవో. హేమని నేనొక్కదాన్నే. ఎందుకు ఆ పేరు సెలక్ట్ చేసావు?" హేమ ఆసక్తిగా అడిగింది.

"మా అమ్మ, అదే మీ నాయనమ్మ పేరు కనకమ్మ కదా? నీకు తన పేరు పెట్టమని మీ నాన్నని అడిగింది. మా అన్నయ్య సంగతి తెలిసిందేగా మొహమాటస్థుడు. 'నా పేరు మోటైతే పోనీ కనకలత అని పెట్టు' అని మా అమ్మ ఉదారంగా సలహా ఇచ్చింది. ఇంత బంగారు తల్లి, ఈ చిట్టిపాపాయ్‌కి కనకమ్మ పేరేంటి? అని దిగులొచ్చింది. అందుకని మా అమ్మతో 'అమ్మా కనకం అంటే బంగారం కదా, పాపాయికి హేమ అని పేరు పెడదామే. హేమం అంటే బంగారం కదా? అని నా టెంత్ క్లాస్ నాలెడ్జ్ ప్రదర్శించాను. హేమ, స్వర్ణ అంతకు మించి నానార్ధాలు నాకు తెలియవు. లేకపోతే నీకు 'అపరంజి' అని పేరు పెట్టమనేదాన్ని. మా అమ్మ 'సరే' అని ఒప్పుకున్నాక మీ నాన్న సంతోషంగా హేమ అని బియ్యంలో రాసేసాడు" మధుమతి చెప్పింది.

అపరంజి! ఈ అత్తకి తనంటే ఎంత ప్రేమ. మరి అమ్మెందుకు అంత ద్వేషిస్తుంది? హేమకి అర్ధంకాలేదు.

మధుమతి వచ్చి వారమైంది. అంతా ఆవిడతో కలిసిపోయారు.  పిల్లలు గ్రానీ, అని, రోహిత్ పిన్నీ అని కబుర్లు చెప్పారు.

ఆ వీకెండ్ రాత్రి పిల్లలు నిద్రపోయాక హేమ మధుమతి ఒళ్ళో తలపెట్టుకుని అడిగింది.

"అత్తా. నువ్వు నాకు క్లారిఫై చేయాలి."

"ఏంటది?"

"మా అమ్మకి నువ్వంటే ఎందుకంత కోపం? నువ్వు బాధపడొద్దుకాని నువ్విలా మాలో కలిసిపోయావంటే 'నాటకాలు' అంది అమ్మ."

"నేనొకప్పుడు మీ అమ్మ మనసు నొప్పించాను హేమా. వదిన ఇన్నేళ్ళయినా మర్చిపోలేదు" మధుమతి బాధగా చెప్పింది.

"ఎందుకో మేం వినొచ్చా? మా పెళ్ళయిన ఈ పన్నెండేళ్ళలో మీరు అనే బంధువు ఉన్నారని నాకు తెలీదు. హేమ ఎప్పుడూ చెప్పలేదు. అత్తగారింట్లో కూడా మీ ప్రస్తావన ఎప్పుడూ రాలేదు" రోహిత్ ఆసక్తిగా అడిగాడు.

"అది కేవలం నా ఊహలు. నిజంకావచ్చు. లేదా కాకపోవచ్చు"

"చెప్పత్తా. పర్లేదు" హేమ కోరింది.

"మీ అమ్మ నాకంటే పది, పన్నెండేళ్ళు పెద్దది. చాలా అందంగా ఉండేది. నాకు చాలా గర్వంగా ఉండేది మా వదిన అందగత్తె అని. ఎప్పుడూ తన చుట్టే తిరుగుతూండేదాన్ని. అమ్మ వద్దని వదిన్నే జడలు వేయమనేదాన్ని. అన్నం

పెట్టమనేదాన్ని. నిజంగా పాపం పద్దెనిమిది, పంతొమ్మిదేళ్ళ అమ్మాయికి ఈ గోలంతా ఎంత నరకమో కదా? ఇంతకంటే ఎక్కువ నరకం ఇంకొకటుంది. మా నాన్న నా చిన్నప్పుడే పోయాడు. అందుకని మా అన్నయ్యంటే నాకు విపరీతమైన ప్రేమ."

మధుమతి కన్నీళ్ళు తుడుచుకుంది.

"ఇప్పటికీ తనమీద నాకు ఆ ఆరాధన నిల్చిపోయింది. వదిన, అన్నయ్య ఏకాంతంగా ఉన్నప్పుడు నేనూ వెళ్ళి అక్కడే కూర్చునేదాన్ని. వదిన వెళ్ళమని చెప్పలేదు. అన్నయ్య చెప్పడు. ఈ విధంగా దాదాపు ఐదారు నెలలు గడిచాక మా పక్కింటి అత్తయ్యగారు నన్ను పిలిచి కోప్పడింది. 'వాళ్ళు కొత్తగా పెళ్ళయినవాళ్ళు. వాళ్ళకి బోలెడు ముచ్చట్లు ఉంటాయి. పానకంలో పుడకలాగా ఎందుకు ఎప్పుడూ వాళ్ళ దగ్గరే ఉంటావు? ఆడుకోడానికి పోవచ్చుగా? లేకపోతే బుద్ధిగా చదువుకోవచ్చుగా?"

"ఆవిడ సలహా మొదట నాకు కోపం వచ్చింది. మా అన్నయ్య దగ్గర కూర్చుంటే ఈవిడకేం నష్టం అనుకున్నాను. కానీ ఆలోచిస్తే నా తప్పు అర్థమైంది. మా అక్క, అదే మీ పెద్దత్త, వదిన ఒకే ఈడువాళ్ళు. అమ్మ అక్కకి పెళ్ళిచేసి, తర్వాత అన్నయ్యకి చేసింది. అక్కది ఊళ్ళో సంబంధమే కాబట్టి అక్కా, బావ మా ఇంటికి వస్తూండేవాళ్ళు. నేను వాళ్ళ గదిలోకి వెళితే మా అక్క 'ఒసే పో బయటకి ' అని కసిరేది. మా అమ్మ కూడా వెళ్ళొద్దనేది. మరి మా అమ్మ అన్నయ్య గదిలోకి ఎందుకు వెళ్ళొద్దనలేదని ఆలోచించాను. ఆ వయసులో నాకు అర్థంకాలేదు కాని, బహుశా మా అన్నయ్య మీదే ఆధారపడ్డ మా అమ్మకి కొడుకు కోడళ్ళ సాన్నిహిత్యం అభద్రతని కలిగించి ఉంటుంది.

"తర్వాత నేను వాళ్ళ మధ్యకి వెళ్ళలేదు. చదువు మీదకి దృష్టి మళ్ళించాను. నువ్వు పుట్టాక నిన్ను ఎత్తుకు తిరిగేదాన్ని. వదిన పనుల్లో బిజీగా ఉంటే ఆడించేదాన్ని. నా దగ్గరే పడుకో పెట్టుకునేదాన్ని. మా వదినకి పనుల్లో సహాయం చేసేదాన్ని. కాని పెళ్ళయిన కొత్తల్లో నా మూర్ఖత్వం వల్ల తను పడిన శారీరక మానసిక హింసని మా వదిన మర్చిపోలేదు. మా మధ్య ఎప్పుడూ ఒక దూరం ఉండేది. వదిన తప్పు కూడా లేదు. పెళ్ళయి కోటి కోర్కెలతో వచ్చిన అమ్మాయికి ఇంట్లో అత్తగారు, ఆడపడుచు రాత్రి పదింటికి కాని లభ్యంకాని ఏకాంతం, చాకిరి ఇవన్నీ ఆవిడకి నిరాశని మిగిల్చాయి. నాకు పెళ్ళిచేసి పంపాక తను మళ్ళీ నన్ను ఆహ్వానించలేదు. అమ్మ ఉన్నన్నాళ్ళూ అప్పుడప్పుడూ వెళ్ళి చూసి వచ్చేదాన్ని. ఆ తర్వాత రాకపోకలు పూర్తిగా పోయాయి. నీ పెళ్ళికి అన్నయ్య కార్డ్ పంపాడు. ఐనా అందర్నీ చూడచ్చని వచ్చాను" మధుమతి కళ్ళు తుడుచుకుంది.

"అత్తా. మామయ్య మంచివాడేనా? మీకు పిల్లలు ఎందుకు లేరు? డాక్టర్లని కలిసారా?" హేమ  ఆమె వంక సానుభూతిగా చూస్తూ అడిగింది.

"చాలా మంచివారు. మాకు పిల్లలు కలగాలంటే అద్భుతం జరగాలి" మధుమతి శుష్కంగా నవ్వింది.

హేమ ప్రశ్నార్ధకంగా చూసింది.

"మా పెళ్ళికి ముందే ఆయనకి వేసక్టమీ అయిపోయింది. తనది రెండో పెళ్ళి. మొదటి భార్య ఏక్సిడెంట్‌లో పోయారు. ఓ కూతురు, కొడుకు అమ్మమ్మ దగ్గర ఉంటారు."

"రెండో పెళ్ళా? అదేంటి?" హేమ నిర్ఘాంతపోయింది.

"ఆయన మాకు పిల్లలు పుట్టే అవకాశం లేదని మధ్యవర్తికి, మధ్యవర్తి వదినకి చెప్పారట. మాకు ఎవరికీ తెలీదు. మేము పెళ్ళికి అంగీకరించడంతో అందుకు ఒప్పుకున్నాం అనుకున్నారట. మామయ్య మోసమేమీ చేయలేదు."

ఎవరు మోసం చేసారో హేమకి అర్ధమైంది.

"అసలు మీకు రెండో పెళ్ళి ఎందుకు చేసారు?" రోహిత్ మొహమాటంగా అడిగాడు.

మధుమతి నవ్వింది. వాళ్ళకి సమాధానం దొరికింది.

"వెళ్ళొస్తా హేమా! కుదిరితే ఎప్పుడైనా అనంతపూర్ రండి. ఈ మధ్య వంటరితనం మరీ భయంకరంగా ఉంటోంది. క్రిందటి నెల అక్క ఇంటికి వెళ్ళి వారం రోజులు ఉన్నాను. అక్కడికి అన్నయ్య వచ్చాడు. వదినకి తెలియకుండా వచ్చాడనుకుంటా. పెద్దవాడైపోయాడు. మాటల్లో నీ గురించి, పిల్లల గురించి చెప్పాడు. వెంటనే నిన్ను చూడాలనిపించింది. నా రాక నీకు అయిష్టం అని తెలిసినా రాకుండా ఉండలేకపోయాను. ఈ జ్ఞాపకాలతో చాలా కాలం సావాసం చేస్తా కాబట్టి వంటరితనం ఉండదులే" మధుమతి నవ్వింది.

"నువ్వు ఎప్పుడు కావాలంటే అప్పుడొచ్చేయ్ అత్తా" హేమ ఆమెని కౌగలించుకుని చెప్పింది.

రోహిత్ సూట్‌కేస్‌తో వెళ్తూంటే, వెనకే మధుమతి బయటకి నడిచింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments